అన్నదాతల అవస్థలు!

- రైతు విశిష్ట సంఖ్య కోసం కార్యాలయాల వద్ద నిరీక్షణ
- ఎల్‌పీఎం సమస్యతో ఇబ్బందులు
- పీఎం కిసాన్ నిధులు పడలేదంటూ పలువురు ఆందోళన



గొంటి పంచాయతీలో రైతు విశిష్ట సంఖ్య నమోదును పరిశీలిస్తున్న అధికారులు

గార: అన్నదాతలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రైతు విశిష్ట సంఖ్య నమోదు పేరిట కూటమి ప్రభుత్వం 'అగ్రిస్ స్టాక్' పేరిట ఓ యాప్‌ను తయారు చేసి అన్నదాతల వివరాలను ఆన్‌లైన్‌లో ఉండేలా చూస్తోంది. రైతు ఆధార్, భూమి తాలుకా సర్వే నెంబరు, గ్రామం, మండలం, జిల్లా వివరాలు నమోదు చేస్తోంది. అన్ని భాగున్నా భూమి వివరాలకు వచ్చేసరికి చాలా పంచాయతీల్లో సర్వేనెంబర్‌తో పాటు ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మెంబర్) నెంబరు ఉంది. ఆ ఎల్‌పీఎంలో పక్కనున్న రైతులు కూడా అదే విస్తీర్ణం కలిసి ఉండటంతో సమస్య వస్తుంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ నిధులు విడుదల చేసిందని సంబంధింత అధికారులు చెబుతున్నారు. విడుదల జరిగితే రబీ కాలంలో పెట్టుబడికి సాయమవుతోందని ఆశ పడుతున్నారు. గార మండలంలో 26 రెవున్యూ గ్రామాల్లో అంపోలు, శ్రీకూర్మం మినహా అన్ని రెవున్యూ గ్రామాల్లో భూ రీసర్వే జరిగింది. మిగిలిన రెవెన్యూ గ్రామాల్లో నిధుల విడుదల చాలా మందికి జరగలేదు. దీంతో రైతులు బ్యాంకుల వద్దకు, రైతు సేవా కేంద్రాలు, సచివాలయాల వద్దకు పరుగులు పెడుతున్నారు. ఒక పక్క రబీ పనులు, ఉపాధి హామీ పనులతో బిజీగాఉన్న రైతులకు ఈ నెంబర్ నమోదు ప్రక్రియ ఇబ్బందిగా మారింది. సోమవారం విడుదల చేసిన పీఎం కిసాన్ పథకానికి సంబంధించి 2024-25 మూడవ విడత నిధులు ఇంతవరకు అందలేదని, పూర్తిస్థాయిలో రైతులకు ఇంకా బ్యాంకు ఖాతాలో పడలేదని, ఈ నెలాఖరు లేదా మర్చి నెలాఖరులోగా పడే అవకాశాలున్నాయని ఆయా శాఖల అధికారులే చెబుతుండటం గమనార్హం.

నమోదు తప్పనిసరి..

ఈ విషయమై మండల వ్యవసాయాధికారి డి.పద్మావతి వద్ద ప్రస్తావించగా ఈ నెలాఖరులోగా రైతులు విశిష్ట సంఖ్య కోసం రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు పీఎం కిసాన్ నిధులు వస్తాయని, ఆ తర్వాత కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశమిస్తాయని చెప్పారు.

జమకాలేదు...



రైతు భరోసా పేరిట గత ప్రభుత్వంలో డబ్బులు పడేవి. మా ఆయన పేరిట సంక్రాంతికి పడతాయని చెప్పారు. తర్వాత పడలేదు. ఇప్పుడు చల్లపేట సిబ్బందికి అడిగితే మీ భూముల వివరాలు మాకు రాలేదని చెబుతున్నారు.

– బగ్గు రాజులమ్మ, చల్లపేట, గార మండలం

రోజూ తిరుగుతున్నా..



భూమి ఉందని చెబుతున్నా నమ్మడం లేదు. నా నెంబరు ఇస్తే ఇప్పటికీ డబ్బులు పడలేదని చెబుతున్నారు. కార్యాలయం చుట్టూ రోజూ తిరుగుతునే ఉన్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– ఎచ్చెర్ల చిన్నవాడు, రైతు, ఆదవరం

స్పందించాలి..



మా పంచాయతీలో భూముల సర్వే జరగలేదని ఎప్పటి నుంచో చెబుతున్నారు. భూమి కాగితాలను అంపోలుకు తీసుకువచ్చాను. అయినా ఎవరూ స్పందించడం లేదు. అధికారులు స్పందించి రైతు సమస్యలపై స్పందించాలి.

– ముద్దాడ దుర్గయ్య, రైతు, లింగాలవలస

ఎట్టకేలకు సిగ్నల్ లైట్లకు మోక్షం



అరసవల్లి మిల్లు కూడలిలో వెలిగిన సిగ్నల్ లైట్లు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలో మరమ్మతులకు గురై ఎప్పటికప్పుడు తీవ్ర అంతరాయాన్ని కలిగిస్తున్న సిగ్నల్ లైట్స్‌కు ఎట్టకేలకు మోక్షం లభించింది. మొరాయిస్తున్నాయ్.. శీర్షికతో ఈ నెల 22న సాక్షిలో ప్రచురితమైన కథనానికి ట్రాఫిక్ సీఐ నాగరాజు స్పందించి లైట్లు బాగు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఏడురోడ్ల కూడలి పాయింట్‌లో సిగ్నల్స్ పనిచేస్తున్నా అరసవల్లి మిల్లు కూడలి, రామలక్ష్మణ కూడలి, డేఅండ్‌నైట్ కూడలి, పొట్టి శ్రీరాములు కూడళ్లలో కొంత ఇబ్బంది తలెత్తాయని, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాలతో మొత్తం బాగుచేయించామన్నారు. మున్సిపల్ అధికారులు చొరవ తీసుకున్నా దీనికి సంబంధించి పూర్తిస్థాయి టెక్నీషియన్ రావడంలో కాస్త జాప్యం జరిగిందన్నారు.

విద్యార్థి దశలో క్రమశిక్షణ అవసరం

రణస్థలం: క్రమశిక్షణతో కూడిన విద్య జీవితాన్ని ఉన్నత స్థితిలో నిలబెడుతుందని ఎంఈఓ ఎ.త్రినాథరావు, జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి అన్నారు. కోష్టలోని నారాయణ స్కూల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను, సమాజాన్ని గౌరవిస్తూ, ఎటువంటి దురలవాట్లకు గురికాకుండా నవ సమాజ నిర్మాణానికి యువత పాటుపడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కో ఆర్డినేటర్ కెల్ల రమణ, మాజీ సర్పంచ్ పిషిణి జగన్నాథం పాల్గొన్నారు.

విద్వేషాలు రెచ్చగొట్టడం తగదు

శ్రీకాకుళం క్రైమ్ : ఇచ్ఛాపురం మండలం డొంకూరు గ్రామంలో ఉన్న 125 మత్స్యకార కుటుంబాలు 50 ఏళ్లగా క్రైస్తవ మతాన్ని ఆచరిస్తున్నాయని, గ్రామంలో ఉన్న హిందువులకు కొందరు తప్పుడు సమాచారం ఇస్తూ శతృభావం పెంచుతున్నారంటూ ఏపీ క్రిస్టియన్ సొసైటీ చైర్మన్ జేమ్స్ కుంపట్ల, సభ్యులు మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. విద్వేషాలు రెచ్చగొట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార క్రైస్తవ మైనార్టీ పౌరుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించకపోతే చర్యలు

- 'సాక్షి'తో అసిస్టెంట్ కమిషనర్ శివకుమార్



మాట్లాడుతున్న శ్రీకాకుళం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ వై.శివకుమార్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రెసిడెన్షియల్, కమర్షియల్, ఖాళీ స్థలాల యజమానులు తప్పనిసరిగా ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలని అసిస్టెంట్ కమిషనర్ వై.శివకుమార్ అన్నారు. సచివాలయ సిబ్బందితో ప్రతి రోజూ డోర్ టు డోర్ కార్యక్రమం చేయిస్తున్నామని చెప్పారు. విధుల్లో చేరిన తొలి రోజే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఉమామహేశ్వరరావు, నరేష్‌లతో పాటు సచివాలయ అడ్మిన్ సెక్రటరీలతో సమావేశం ఏర్పాటుచేశామని, పన్నులు వసూలు చేయడంలో ప్రత్యేక దృష్టి సారించాలని లేకుంటే తగిన చర్యలు చేపడతామని అన్నారు.

– పన్నుల లక్ష్యం 2024-2025 సంవత్సరానికి గాను రూ.39.8 కోట్లు లక్ష్యానికి గాను ఇప్పటివరకు రూ.16.22కోట్లు వసూలు చేశామని చెప్పారు. రూ 22.86 కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఏడు విలీన పంచాయతీలతో కలిపి కార్పొరేషన్ పరిధిలో కమర్షియల్, రెసిడెన్షియల్, ఖాళీ స్థలాలు 1.08 లక్షలు ఉన్నాయని చెప్పారు. పన్నులు మార్చిలోపు చెల్లించాలని, లేకుంటే ముందస్తుగా నోటీసీలిచ్చి విద్యుత్ కనెక్షన్లు, కుళాయి కనెక్షన్లు తొలగిస్తామని తెలిపారు. పన్నులు చెల్లించేవారికి సైతం కొంతమంది అడ్డుతగిలి ఆపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఏ ఒక్కరినీ విస్మరించే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. దీర్ఘకాలంగా బకాయి పడ్డ భవనదారులు పన్నులు చెల్లించకపోతే భవనాల్ని సీజ్‌చేస్తామని హెచ్చరించారు.

వైభవంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



ఎచ్చెర్ల క్యాంపస్: లింగాలపేట సాయినగర్‌లోని షిర్డీసాయి బాబా ఆలయం వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కాకడ హారతి, పాలాభిషేకం, హోమం, ధూమ్, సంధ్యాహారతి కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యంలో భక్తులు పాల్గొన్నారు.

మట్టినమూనా పరీక్షలపై అవగాహన

శ్రీకాకుళం రూరల్: గూడెం గ్రామ సచివాలయం వద్ద మట్టి నమూనా పరీక్షలపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భూసార పరీక్ష కేంద్రం ఆమదాలవలస వ్యవసాయ సంచాలకులు సత్యవతి మట్టి నమూనా పరీక్షలను సందేహాలను నివృత్తి చేశారు.

మహిళలపై అరాచకాలు అరికట్టాలి



గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: రాష్ట్రంలో రోజుకు సగటున 48 మంది మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని కూటమి ప్రభుత్వమే అసెంబ్లీ సాక్షిగా చెప్పిందంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థమౌతుందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న అరాచకాలు చూస్తుంటే ఈ కుటమి ప్రభుత్వానికి మహిళలపై ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమౌతుందన్నారు. గత ప్రభుత్వంలో విజయవంతమైన దిశ చట్టాన్ని నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి అరాచకాలకు అడ్డుకట్ట వేయాలన్నారు.

కొలిక్కివచ్చిన యువకుడి మృతికేసు!

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని బలగ టీ ఎస్టేట్ కాలనీలో మజ్జి రమేష్‌నాయుడు మృతిపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు కీలక అనుమానితురాలిని ఇప్పటికే అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. రెండో పట్టణ పోలీసులు బుధవారం పూర్తి వివరాలు వెల్లడించే అవకాశముంది.

శివరాత్రి వేడుకలకు సిద్ధం

మహా శివరాత్రి వేడుకలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. శ్రీకాకుళం నగరంతో పాటు గార మండలంలో శివాలయాలను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. క్యూలైన్లు, టెంట్లు సిద్ధం చేశారు. ఉచిత ప్రసాదాలు, వాటర్ ప్యాకెట్ల పంపిణీ కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు.

–శ్రీకాకుళం కల్చరల్/గార



ఉమారుద్ర కోటేశ్వరాలయంలో క్యూలైన్లు



విద్యుద్దీపాలంకరణలో భీమేశ్వరాలయం



విద్యుద్దీపాలంకరణలో ఉమాజఠలేశ్వరాలయం



విద్యుత్ కాంతులతో శ్వేతగిరి వీర వసంతేశ్వర ఆలయం

క్లుప్తంగా

స్వర్ణ కిరీటం తయారీకి విరాళం



బంగారం అందజేస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కాకివీధిలో ముత్యాలమ్మ తల్లి అమ్మవారికి స్వర్ణ కిరీటం చేయించేందుకు షిరిడీసాయి స్వీట్ వాసు మంగళవారం ఐదు గ్రాముల బంగారాన్ని విరాళంగా మంగళవారం కమిటీ సభ్యులకు అందించారు. కిరీటం తయారీకి దాతలు సహకరించాలని కమిటీ సభ్యులు ఇటీవల ఒక ప్రకటన విడుదల చేశారు.

ఉత్సాహంగా వీడ్కోలు సభ

ఎచ్చెర్ల క్యాంపస్: కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలతో సందడి చేశారు. హెచ్‌ఎం ఎం.లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉంటూ శ్రద్ధతో పరీక్షలు రాయాలన్నారు. ముఖ్యమైన పాఠ్యాంశాలపై దృష్టిపెడితే మెరుగైన మార్కులు సాధించవచ్చని చెప్పారు.

ఆదిత్యాలయానికి జనరేటర్ వితరణ



ఈవోకు జనరేటర్‌ను అందజేస్తున్న దాత

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి రూ.1.30 లక్షల విలువైన జనరేటర్‌ను నగరానికి చెందిన షణ్ముఖరావు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, నేతేటి హరిప్రసాద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను శతశాతం వసూలు చేయాలి



సమీక్షిస్తున్న ఈవోపీఆర్‌డీ కూర్మారావు

గార: ఇంటి పన్నులను వేగవంతం చేయాలని, మార్చి నెలాఖరు కల్లా శతశాతం పూర్తి చేయాలని ఈవోపీఆర్‌డీ అరసవిల్లి కూర్మారావు అన్నారు. మంగళవారం రామచంద్రాపురం సచివాలయంలో ఇంటి పన్నుల వసూళ్లపై రికార్డులు తనిఖీ చేశారు. ప్రజలకు ఇంటి పన్నులపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.రాము, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవ పూజలు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని లక్ష్మిడిపేటలో కోదండ రామస్వామి ఆలయ వార్షికోత్సవ పూజలు మంగళవారంతో ముగిశాయి. ఉదయం ఐదు గంటల నుంచే పూజలు, హోమాలు, పుష్ప యాగాలు నిర్వహించారు. ఆరు రోజుల పాటు ఘనంగా జరిగిన వార్షికోత్సవ పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వర్సిటీలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ (అన్నెపు పరశురాం పాత్రో) బ్లాక్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి పోలింగ్ బూత్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ బి.గోపాలరావు తెలిపారు. ఎచ్చెర్ల మండలం ఉపాధ్యాయ ఓటర్లు హాజరై ఓటు హక్కు వినియోగించుకుంటారని చెప్పారు. మండలంలో 170 ఓట్లు ఉన్నట్లు తెలిపారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ

శ్రీకాకుళం రూరల్: చెత్తను పారబోయవద్దని, సంపద కేంద్రానికి తరలించాలని ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ సూచించారు. కల్లేపల్లి గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద నిల్వ ఉన్న చెత్తను ఉదయం పూట పారిశుద్ధ్య కార్మికులకు అందివ్వాలని, చెత్తతోనే సంపద సృష్టించాలని కోరారు. అంతకు ముందు గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. మహా శివరాత్రి వేడుకల నేపథ్యంలో గౌరీసమేత మణినాగేశ్వర స్వామి ఆలయ పరిసరాలను కార్మికులు శుభ్రం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగు నరేంద్రకుమార్, ఎంపీటీసీ బాణ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో బోధన



అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటల కూడిన బోధన అందించాలని ఎంఈఓలు అరసాడ రవి, ముఖ్ల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జి.సిగడాం మోడల్ స్కూల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి పేరిట ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి, డీఆర్‌పీలు పిట్టా అప్పారావు, కిల్లారి వెంకటరమణ, శ్రీరామదత్త పాల్గొన్నారు.

– జి.సిగడాం

ట్రిపుల్ ఐటీలో 'సహాయ మిత్ర'



శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఎస్ఎంపురం క్యాంపస్‌లో మంగళవారం సహాయ మిత్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ ప్రారంభించారు. మెడికవర్, జెమ్స్ ఆస్పత్రుల డాక్టర్లు హాజరై విద్యార్థులకు వైద్యసేవలు అందించారు. ఏవో ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్స్ కె.మోహనకృష్ణ చౌదరి, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ రవి, క్యాంపస్-2 ఇన్‌చార్జ్ సాగర్ పర్యవేక్షించారు.

–ఎచ్చెర్ల క్యాంపస్

ఘనంగా మెహెర్‌బాబా జయంతి



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కత్తెర వీధి మెహెర్ కేంద్రంలో అవతార్ మెహెర్‌బాబా 131వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పీఎల్ఎన్ రాజు మాట్లాడుతూ ప్రేమతత్వాన్ని పెంచాలనే బాబా వాక్యంతో సమాజంలో అసమానతలు తొలగిపోతాయన్నారు. అనంతరం మెహెర్‌బాబా చిత్రపటం వద్ద 131 కొవ్వొత్తులు వెలిగించి, కేక్‌కట్ చేశారు. ముందుగా సప్తవర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఊరేగింపు నిర్వహించారు. పేదలకు వస్త్రదానం, అన్నదానం చేశారు. కార్యక్రమంలో పి.వి.రంగప్రసాద్, భాస్కరరావు, సత్యనారాయణ, ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. పీఎన్ కాలనీలోని మెహెర్ విద్యావిహార్‌లో అవతార్ మెహెర్‌బాబా జయంతి ఘనంగా నిర్వహించారు. డాక్టర్ ఉషాదేవి, కిల్లాన ఫల్గుణరావు బాబా ప్రవచనాలు వినిపించారు. పాఠశాల పూర్వ విద్యార్థి సింగూరు మధుసాయి డాక్టరేట్ సాధించిన సందర్భంగా ఆయన్ను ఘనంగా సత్కరించారు. అనంతరం చిన్నారులు నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.కామేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి రెవెన్యూ, ఉపాధి హామీ పథకం, ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన, ఐసీడీఎస్, జీఎస్‌డబ్ల్యూఎస్, పారిశుద్ధ్యం, వైద్య ఆరోగ్యం, పీజీఆర్ఎస్ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరిష్కరించి ఫిర్యాదులపైనా ఆడిటింగ్ నిర్వహించాలన్నారు. ఏపీ సేవ, మీసేవా, పి.జి.ఆర్.ఎస్.దరఖాస్తుల స్థితిగతులపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలన్నారు. జిల్లాలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనను మిషన్ మోడ్‌లో చేపట్టాలని ఎంపీడీఓలు, విద్యుత్ శాఖ ఏఈలకు సూచించారు. అనంతరం రెవెన్యూ సదస్సులు, రీసర్వే, ఫిర్యాదులను పరిష్కరించడానికి అనుసరిస్తున్న విధానాలు, ఐవీఆర్ఎస్ కాల్స్ విశ్లేషణ, గృహ స్థలాల రీ వెరిఫికేషన్, అభ్యంతరం లేని ఆక్రమణల క్రమబద్ధీకరణ, ల్యాండ్ బ్యాంక్, కోర్టు కేసులు, లోకాయుక్త కేసులు, ఎస్సీ ఎస్టీ కేసుల పరిష్కారంపై చర్చించారు. ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపొనెంట్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఏఈలు, డీఈల స్థాయిలో పల్లె పండుగ పనుల స్థితి, గత ప్రభుత్వ హయాంలో మంజూరై ఇప్పుడు పురోగతిలో ఉన్న పనులకు బిల్లులు అప్‌లోడ్ చేయడంపై చర్చించారు. ఐసీడీఎస్‌లో మరుగుదొడ్లు, విద్యుత్, నీటి సరఫరా స్థితిపై సమీక్షించారు. గ్రామ సచివాలయాలకు సంబంధించి గత సమావేశంలో చర్చించిన హాజరు, ఇతర సర్వేల స్థితిపై అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్యంపై సమీక్షలో భాగంగా చెత్త నుంచి సంపద తయారీపై శ్రద్ధ వహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, సీపీవో ప్రసన్నలక్ష్మి, డీపీఓ భారతి సౌజన్య, జిల్లా వ్యవసాయాధికారి అధికారి కోరాడ త్రినాథస్వామి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, హౌసింగ్ పీడీ నగేష్, ఆర్ అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగంలో ప్రోత్సాహం



మాట్లాడుతున్న సాయిశ్రీనివాస్

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామీణ యువతను ప్రధాన మంత్రి మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ కింద పారిశ్రామికరంగంలో ప్రోత్సహిస్తున్నట్లు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జోనల్ మేనేజర్ సాయిశ్రీనివాస్ అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో మంగళవారం జిల్లా రిసోర్సు పర్సన్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు గ్రామీణ యువత, స్వయం స్వహాయ సంఘాలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. జీడి, జూట్, బెల్లం, పండ్లు, పచ్చళ్ల తయారీ, నిల్వ, ప్యాకింగ్, వ్యవసాయ ఉత్పత్తుల ప్రోసెసింగ్ వంటివి ప్రోత్సహిస్తామన్నారు. వ్యక్తిగతంగా, బృందాలుగా సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించేందుకు ముందుకు రావచ్చన్నారు. బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయని చెప్పారు. రూ.2 లక్షలు నుంచి రూ.3 కోట్లు వరకు రుణాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సీడాప్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'జగన్ అంటే మాకూ అభిమానమే'

శ్రీకాకుళం అర్బన్: తనతో పాటు పాకిస్తాన్ కోస్టుగార్డు పోలీసులకు బందీలుగా దొరికిన తోటి 21మంది మత్స్యకారులు, వారి కుటుంబ సభ్యులు తమపై చేస్తున్న ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదని డి.మత్స్యలేశం గ్రామానికి చెందిన మత్స్యకారుడు రామారావు అన్నారు. శ్రీకాకుళం ఎన్‌జీవో కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సినిమాను రాజకీయంగా చూడటం తగదన్నారు. జగన్ అంటే ఎంతో అభిమానమని, ఆయన ఫోటో కూడా తమ ఇంట్లో ఉందన్నారు.